తరిగిపోతున్న పచ్చదనం!


పత్తికొండ-రాతన రహదారి కిరువైపులా తరిగిపోతున్న చెట్లు

తుగ్గలి : ఎన్నో ఏళ్లుగా రహదారి పక్కనున్న వృక్షాలు ఎంతో మంది బాటసారులు, వాహనదారులు సేద తీరేందుకు నీడ నిచ్చాయి. ప్రధాన రహదారి కిరువైపులా అశోకుడు, పెద్దలు నాటిన చింత చెట్లు నేడు కనుమరుగువుతన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. 40 ఏళ్ల క్రితం వరకు ఆదోని-గుత్తి ప్రధాన రహదారి వెంట చింత చెట్లు భారీగా ఉండేవని ఈ ప్రాంత పెద్దలు చెబుతారు. కొన్నేళ్ల క్రితం కొన్ని చెట్లు ఎండిపోగా, రోడ్డు విస్తరణలో మరికొన్ని, కేబుల్ పనులతో ఇంకొన్ని ఇలా కొన్నేళ్లుగా చెట్ల సంఖ్య భారీగా తరిగిపోతుండటంతో ప్రధాన రహదారి వెంట నీడ కరువైంది. మొక్కలు పెంచాలి, వాటిని సంరక్షించాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఊదరగొడుతున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న చెట్లను కాపాడటంలో విఫలమైన ప్రభుత్వం, అధికారులు వాటి స్థానంలో మొక్కలు నాటి పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ఏటా వనం-మనం, పచ్చదనం అంటూ పలు కార్యక్రమాలతో మొక్కలు నాటేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఫలితం లేకపోతోంది. నిధులు స్వాహా అవుతున్నాయే తప్ప చెట్లు బతికించిన పాపాన పోలేదు.

క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


దేవరగట్టులో మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానికులతో పాటు కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజారులు స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

'తెలుగు కల్పవల్లి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : కమలా కళానికేతన్ సాహితీ సంస్థ 39వ వార్షికోత్సవం సందర్భంగా కవి సవ్వప్ప గారి ఈరన్న రాసిన 73వ పుస్తకం తెలుగు కల్పవల్లి పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవి పుల్లయ్య యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేయగా కాశింశెట్టి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు ఈరన్న కృషిని అభినందించారు. తెలుగు కవులకు ప్రభుత్వం ఆదరించాలని కోరారు. రంగన్న, కాశీవిశ్వనాథ తదితర కవులు పాల్గొన్నారు.

గుమ్మల అంజనయ్య సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మద్దికెర : సీపీఐ నాయకుడు గుమ్మల అంజనయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో గుమ్మల అంజనయ్య 33వ వర్ధంతి సందర్భంగా స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం రైతుల సమస్యలపై పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం నాయకులు కోదండరాముడు, పాల లక్ష్మన్న పాల్గొన్నారు.

కంచె ఏర్పాటు


సచివాలయం వద్ద కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని గూళ్యం సచివాలయం-1 వద్ద నెలకొన్న అపరిశుభ్రతను సర్పంచ్ హులిగమ్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ కార్మికులు తొలగించారు. అలాగే సచివాలయం చుట్టూ కంచె ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. గతంలో సచివాలయ పక్కన అపరిశుభ్రత నెలకొని ఉండేదని, ప్రజల విజ్ఞప్తి మేరకు పారిశుద్ధ్య పనులు చేయించామన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి


కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: పద్మశాలీయులల ఆరాధ్యదేవుడు శివభక్త మార్కండేయస్వామి జయంతి వేడుకలు ఆదివారం హొళగుందలో ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన పద్మశాలీయులు పెద్దబావి వద్ద గంగపూజ అనంతరం మార్కండేయస్వామి, శివ పార్వతుల చిత్రపటాలతో కుంభాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి చేసి మహా మంగళహారతి, కాగడ హారతి, కుంకుమార్చన, అభిషేకాలు తదితర పూజలు చేశారు.

విజయవంతం చేయండి

వెల్దుర్తి: హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన మంద కృష్ణ మాదిగ చేపట్టిన వేల గొంతుకలు -లక్షల డప్పులు కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో సమితి సీనియర్ నాయకుడు నాయకంటి గిడ్డయ్య మాదిగ అధ్యక్షతన పోస్టర్లను ఆవిష్కరించారు.

హొళగుంద జాతరకు నాంది...

- ఘనంగా సిద్ధేశ్వరస్వామి కంకణ ధారణ


గుహలో వెలిసిన సిద్ధేశ్వరస్వామి

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 7న జరిగే సిద్ధేశ్వరస్వామి రథోత్సవం, ఇతర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో స్వామి విగ్రహాలకు కంకణధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దప్ప, సిద్దమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, ఆలయ నిర్వాహకులు అనంతరం స్వామి వారికి కంకణాధారణ చేశారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారి విరాట్‌మూర్తికి మహామంగళహారతి, అభిషేకాలు, నైవేద్య సమర్పణ చేపట్టారు. అలాగే ఇతర ప్రత్యేక పూజలతో పాటు మాంగల్య నిశ్చితార్థ కార్యక్రమాలు జరిపించారు. ఈ నెల 7న సిద్ధేశ్వరస్వామి రథోత్సవం, 8న లంకాదహనం, 9న కంకణ విసర్జన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ, శివ శంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు.


శ్రీ మాళ సహిత మల్లేశ్వరస్వామి ఆలయం ముందు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ!


అధ్వానంగా గజ్జహళ్లి రోడ్డు

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వరకున్న రోడ్డుతో పాటు వందవాగిలి రోడ్డు పూర్తిగా శిథిలమయ్యాయి. వాహనాల రాకపోకలకు కూడా వీలకానంతగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. హొళగుంద నుంచి కడ్లమాగి, ఎల్లెల్సీ మీదుగా గజ్జహళ్లి వరకు పూర్తి అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. భారీ గుంతలు పడి రోడ్డుకు ఇరు వైపుల ముళ్లకంపలు పెరగడంతో రాకపోకలకు అవస్థలుపడుతున్నారు. మండల కేంద్రం హొళగుందకు, పొలాలకు నిత్యం ప్రజలు ఈ మార్గంలో వెళ్లాల్సి ఉంది. ఇక వర్షం వస్తే దారిలో ప్రయాణం సాహసమే. రోడ్డు ధ్వంసమవడంతో పెద్ద వాహనాలు 9 కి.మీ దూరంలో నున్న మండల కేంద్రానికి వందవాగిలి లేదా ఆదోని మీదుగా 70 కి.మీ చుట్టుకుని రావాల్సిన పరిస్థితి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

వెల్దుర్తి: ఆధ్యాత్మిక, స్వచ్ఛంద ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీఓ)కు చెందిన శిక్షణ కేంద్రం ఏర్పాటుకు మండల కేంద్రంలోని తొగర్చేడు రోడ్డులోనున్న 18 సెంట్ల స్థలాన్ని సంస్థ సీనియర్ ఉపాధ్యాయుడు డాక్టర్ వినోద్ ఆదివారం పరిశీలించారు. త్వరలో కేంద్రం ఏర్పాటుకు ఇటీవల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ప్రశాంత్ కుమార్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ తన రూ.40 లక్షల విలువజేసే వెల్దుర్తిలోని స్థలాన్ని విరాళంగా సంస్థ వ్యవస్థాపకుడు రవిశంకర్‌కు బెంగళూరులో అప్పగించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సంస్థ ఉద్యోగి దాతతో కలిసి స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


హొళగుంద తేరు బజారులో రేగిన దుమ్ము

తినలేం.. ఊపిరి పీల్చలేం!



హొళగుంద: స్థానిక తేరుబజారుతో పాటు బస్టాండ్ నుంచి ఈర్లకట్ట, వాల్మీకి సర్కిల్ వరకు దుమ్ము, ధూళి కమ్ముకుంటుండటంతో ప్రజలకు ఊపిరాడటం లేదు. దుమ్ముతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలంతా ఆ ప్రాంతాల్లో తిరిగే వాహనాలతో రాత్రికంతా దుమ్ము పేరుకుపోతుంది. దీంతో రోడ్డు పక్కనున్న హోటళ్లలో టిఫిన్‌లు, ఇతర పదార్థాలను తినేందుకు జనం జంకుతున్నారు. ఇక షాపుల్లో పదార్థాలు, సరుకులపై దుమ్ము పడుతుండటంతో వ్యాపారాలు చేసుకోలేక పోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. వర్షాకాలంలో భారీగా మట్టి పేరుకుపోయి బురదకుంటలా తయారవుతుంది. దీంతో ట్రాక్టర్‌ను పెట్టి బురదపే తొలగిస్తారు. సాధారణ రోజుల్లో దుమ్ము ధూళి సమస్య వేధిస్తుందని, ఈ కారణంగా ఆరోగ్యం దెబ్బతింటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బస్టాండ్ నుంచి ఈర్లకట్ట, వాల్మీకి సర్కిల్ వరకు బీటీ లేదా సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పామయ్యతాత తిరునాల



పూజలందుకుంటున్న పాయయ్య తాత, తిరునాల సందర్భంగా కొనుగోలుదారుల సందడి

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పామయ్యతాత తిరునాల ఆదివారం ఘనంగా జరిగింది. గురుశిష్యుల బంధానికి ప్రతీకగా, బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం ఇరు గ్రామాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధంగా తిరునాలకు పేరుంది. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన పామయ్యతాత శిష్యుడైన నార్లాపురం పెనికలపాటి హనుమంతయ్య వంశీయుల తొలి నైవేద్యం, తాత వంశీయులైన బొమ్మిరెడ్డిపల్లె వారసుల పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం, అల్లుగుండు, మల్లెపల్లె, వెల్దుర్తిలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు తాత సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకాలంకరణ, నందికోలసేవ, చెక్కభజనలు, వెలసిన అంగళ్లలో ఆడపడుచుల గాజుల, చిన్నారుల బొమ్మల, చెరుకుగడల కొనుగోళ్ల సందడితో తిరునాల కనుల పండువగా జరిగింది. వెల్దుర్తి సీఐ మధుసూధన్ రావ్, ఎస్‌ఐ అశోక్ తన సిబ్బందితోను బందోబస్తు నిర్వహించారు.

ఆలూరు: మండలంలోని ఆరికెర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మాళ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దేవరగట్టు ఆలయ పూజారి గురు రవిశాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి, గోపూజ, పుణ్యాహ

14న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

మద్దికెర : మండల కేంద్రంలో మద్దమాంబ జాతర పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు గుంతకల్లు రహదారిలోనున్న పెట్రోలు బంకు వద్ద రాష్ట్రస్థాయి సీనియర్ ఒంగోలు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వృషభాలకు దాతల సహకారంతో వరుసగా.. రూ.60,116, రూ.40,116, రూ.30,116, రూ.20 వేలు, రూ. 10,116, రూ.5116 వేలు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల వారు 14న ఉదయం 7 గంటల లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 984940 9827, 9581625125 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 4వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఏరియా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వీరేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ అక్రాస్ గ్రామీణ్, సన్ కిసాన్ అగ్రి లిమిటెడ్ తదితర కంపెనీల హెచ్ఆర్‌లు హాజరుకానున్నారని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తియిన, 10 పాసైన వారు హాజరుకావచ్చున్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు నాలుగు పాస్‌ఫొటోలు, ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : 2024-25 సంవత్సరానికి సంబంధించి వెనుకబడిన తరగతుల వారు స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీ రుణాలు అందించడానికి ఈనెల 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య ఆదివారం తెలిపారు. మండలానికి 50 యూనిట్లు కేటాయించారని, యూనిట్ విలువ ఆధారంగా 50 శాతం సబ్సిడీ అందజేస్తారని చెప్పారు. ఆసక్తి గల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిప్పగిరి: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆయా గ్రామాల సచివాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఓబీఎంఎంఎస్ సైట్ ప్రారంభమైందని తెలిపారు. వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పత్తికొండ సర్కిల్ సీఐ విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం తుగ్గలి పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ సాయిప్రవీణ్, సిబ్బంది సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. స్థానిక కేజీబీవీ వెనుక గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారా బట్టీలను ధ్వంసం చేసి 225 లీటర్ల ఊటను పారబోశారు. సారా తయారు చేసినా, అమ్మినా కేసులు తప్పవని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు.

11న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో వెలసిన లాలూస్వామి తాత ఉరుసును పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4 వేలు నగదు అందజేస్తామని, అలాగే.. బెస్ట్ డిఫెండర్, బెస్ట్ రైడర్‌లకు సైతం బహుమతులందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించాలని, వివరాలకు సెల్: 7702354267 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

53 ఏళ్ల తరువాత కలిశారు..


పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1971-73 తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారందరూ ఏడుపదుల వయస్సులో ఉన్నప్పటికీ నాటి మిత్రులంతా కలుసుకోవడంతో ఉల్లాసంగా గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు.

వేడుకగా ప్రతిష్ఠోత్సవాలు



నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ మాళ సమేత మల్లేశ్వరస్వామి విగ్రహాలు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి

వాచనం, కంకణధారణ, ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర హవనములు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శ్రీ మాళ సహిత మల్లేశ్వరస్వామి విగ్రహాల ప్రతి ష్ఠాపనతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. లోగిళ్లు బంధుమిత్రులతో కిటకిటలాడాయి. అలాగు ఆడపడుచులకు ఒడిబియ్యం పోశారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముందు 101 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠోత్సవాలను తిలకేందుకు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా వేడుకల్లో ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శశికళ, జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, మండల అధ్యక్షుడు మల్లికార్జున, నాయకుడు వైకుంఠం మల్లికార్జున చౌదరి పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే విరూపాక్షి రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఆలూరు ఎస్ఐ జి.దిలీప్ కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓబులేశుడి దర్శనం.. సులభతరం

- తొగలగల్లు కొండల్లో వెలసిన స్వామి వారు
- పురాతన కాలంలో ఏర్పాటు చేసిన మార్గంలోనే నేటికీ భక్తుల రాకపోకలు
- దాతల సహకారంతో ఆలయానికి మెట్లు ఏర్పాటు


తొగలుగల్లు సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేశుడు, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి


మెట్లు నిర్మిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేశు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఆలయానికి వెళ్లేందుకు ఇప్పటి వరకు సరైన దారిలేదు. దీంతో కొండల్లో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడేవారు. దీంతో దాతలు, గ్రామస్తులు సహకారంతో మెట్లు నిర్మాణం చేపడుతున్నారు. పెద్ద కొండపై స్వామి వారి ఆలయం ఉండడంతో పూర్వం వేసిన చిన్న మెట్లు ద్వారా భక్తులు ప్రయాసతో దర్శనం చేసుకునేవారు. ప్రస్తుతం మెట్లు నిర్మాణపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తం 450 మెట్లు నిర్మాంచాల్సి ఉండగా ఇప్పటి వరకు 350 మెట్ల నిర్మాణం పూర్తైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక మెట్టు నిర్మాణానికి రూ.3వేలు ఖర్చు వస్తుందని, ఈ లెక్కన మొత్తం ఖర్చు రూ.13.50 లక్షలు అవుతుందని చెప్పారు. మార్చినెలలో స్వామి వారి ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అప్పటి లోగా నిర్మాణం పూర్తయితే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు ఉండవని చెప్పారు.


మెట్ల నిర్మాణానికి బండరాళ్లను మోసుకెళ్తున్న తొగలుగల్లు గ్రామస్తులు

సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటి సభ్యులు మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆదోని, కౌతాళం ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ జీఓ నంబర్.117 రద్దు పేరుతో గ్రామ స్థాయిలోని అన్ని పాఠశాలలను ఒకే పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. ఆదర్శ, ఫౌండేషన్ పాఠశాలల పేరుతో 2 కిలో మీటరు దూరంలో ఉన్న పాఠశాలలను విలీనం చేయడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతుందన్నారు. ఈ నిర్ణయం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసి నిర్వీర్యం చేసేదిగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలు విలీనం చేసే చర్యలను వెంటనే నిలిపి వేయాలన్నారు. మిగిలి పోతున్న స్కూల్ అసిస్టెంట్లను 3,4,5 తరగతులు ఉన్న ఆదర్శ పాఠశాలల్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, నాయకులు రామాంజినేయులు, సుధాకర్ బాబు, రామాంజినేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్స్(పీఎల్‌వీ)ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వలంటీర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లా వాసులై వుండాలని, సామాజిక సేవ, చట్టంపై అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకిత భావంతో పని చేసే ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి, హైస్థాయి విద్యార్హతలతో పాటు చట్ట, సామాజిక సేవారంగంలో పరిజ్ఞానం వున్న వారికి ప్రాధాన్యత వుంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, ఎమ్మిగనూరు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పొందవచ్చని సూచించారు. పూరించిన దరఖాస్తులను 5వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సమర్పించాలన్నారు.